కథా నిలయం
4682
శ్రీకాకుళం

మాక్కొంచెం నమ్మకమివ్వండి

"వదినా నా పింక్ కాటన్ చీర ఐరన్ చేయమన్నాను చేసిపెట్టావా?" బాత్‌రూమ్‌లో నుండే కేకేసింది సరోజ.

"నిన్న కరెంటు లేదు... ఉదయం నుంచీ చూస్తున్నావుగా, చెయ్యి తీరకలేదు" ఇడ్లీలు తీసి గిన్నెలో సర్దుతూ చెప్పింది భారతి. మనసు కన్నీళ్ళు కారుస్తోన్నా ఆమె పెదవులు మాత్రం నవ్వుతూనే వున్నాయి.

"ఇప్పుడు నేను ఎలా వెళ్ళాలి కాలేజీకి" మరో కేక.

"రాత్రి కరెంటు లేకపోడమేంటి? పదింటికి వచ్చిందిగా చేసిపెట్టి పడుకోకూడదూ... ఉదయం నుండీ ఏదో చాకిరీ చేసేస్తున్నట్లుగా పెద్ద ఫోజు" సాధిస్తున్నట్లుగా అంది అత్తగారు. అప్పుడే వంటగది గుమ్మంలోకి వచ్చిన భర్తని చూసింది భారతి. ఆమె కళ్ళు అతడి సాను భూతి కోసం ఎదురు చూస్తున్నట్లుగా వున్నాయి.

కానీ అతడిదేమీ పట్టనట్లుగా ఆమె మీద చిరాకు పడ్డాడు.

"యింకా ఏం చేస్తున్నావు? ఏమిటింత ఆలస్యం? త్వరగా చేయడం చేతకాకపోతే ఓ గంట ముందు లేవడం అలవాటు చేసుకోవాలి... ఛీ! ఎప్పుడో పాతరాతి యుగంలో పుట్టాల్సిన దానివి. కొంచెంకూడ స్పీడు లేదు" విసుక్కున్నాడు. దెబ్బతిన్న ఆమె హృదయం మెదడుకు సంకేతం పంపి కళ్ళను అతడి వంక తిరగేలా చేసింది.

'ఉదయం నుండీ కరెంటు లేకపోవడంతో చెట్నీ చేత్తో రుబ్బుకొచ్చానండీ' అంటూ చెప్పలేదామె. 'రాత్రిళ్ళు మీరు ఒంటిగంటకు కాకుండా కాస్త ముందు రావటానికి ప్రయత్నిస్తే నేను త్వరగా పడుకుని యింకా కొంచెం ముందు లేవడం నేర్చుకుంటానండీ' అంటూ నిష్ఠురపడలేదామె. అయితే భారతి లోపల వున్న భారతి మాత్రం భారతిని తెగ కోప్పడు తోంది. మరీ అంత సహనంగా వున్నందుకు.

చివరికి భారతే గెల్చింది. మౌనంగా భర్తకి యిడ్లీ వడ్డిస్తోందామె. లోపలి భారతి ముడుచుకుపోయింది. సాధారణంగా ఈ లోపలి భారతి విప్లవాత్మకంగా భారతితో పోట్లా డినా ప్రతీసారి తానే ఓడిపోయి ముడచుకుపోతూంటుంది. హద్దులు లేని భారతి సహనాన్ని తిట్టుకుంటూ వుంటుంది.

"అమ్మాయ్ భారతీ! వడ్డించేస్తావా పదయిపోయింది" మామగారి హడావుడి.

"ఆ అప్పుడే మీకు వడ్డించి వుంచింది. మీరు రావడమే తరువాయి" ముందరింట్లో కాళ్ళు బార్లజాపుకుని. ఆవేల్టి పేపరు తిరగేస్తూ అత్తగారు ఓ విసురు విసిరింది. ఆమె అలా తీరిగ్గా కూర్చుని పేపరు చూడకపోతే కనీసం భర్తకి వడ్డన కార్యక్రమం చూడొచ్చుకదా మళ్ళీ లోపలి భారతి నిద్ర లేచింది.

ఆవిడ నోరు నొక్కి - "ఒక్క క్షణం మామయ్యా... అయిపోయింది వచ్చేస్తున్నాను" హడావిడిగా భర్తకి మంచి నీళ్ళందిస్తూ జవాబిచ్చింది భారతి.

"ఏవిటొక్క క్షణం... నేను షాపు ఓనర్ని కాదమ్మా... గుమస్తాని. ఇంకా ఆలస్యంగా వెళితే నన్నక్కడ మాలవేసి ఆహ్వానించరు. అయినా త్వరత్వరగా వంట చేయడం రాకపోతే ఎలా?" విసురుగా బయటికెళ్ళి పోయాడతడు భోజనం చేయకుండా. అత్తగారు తనవేపే కోపంగా చూస్తోంది.

హతాశుతురాలైంది భారతి.

"వెళ్తే వెళ్ళాడులే ఒక్కరోజు కడుపు మాడిందంటే రెండో రోజిలా విసుగ్గా వెళ్ళడు" లోపలి భారతి ఉవాచ.

వీరరాఘవులు ఓ బట్టల కొట్లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తాను ఇంటా, బయటా ఎక్కడా ఎవరి మీదా చూపించలేని అధికారాన్నీ, అజమాయిషీనీ యింటి కోడలి మీదా, అప్పుడప్పుడూ కొడుకు మీదా ప్రదర్శిస్తూ వుంటాడు. భార్య అతడిని ఎప్పుడూ లెక్కచేయదు. ఆ అసహనమే కోడలి మీద చిరాకుగా మారుతుంటుంది అతడిలో.

"అమ్మా నా క్యారేజీ సర్దేశావా?" ఆరేళ్ళ కొడుకు పిలుపులాంటి అరుపు.

"ఇదుగో నాన్నా అయిపోయింది" అప్పుడు కూడా సహనాన్ని కోల్పోలేదామె.

"అమ్మా నువ్వెప్పుడు లేటే... స్కూలుకి ఒక్క రోజు కూడా నేను టైముకి వెళ్ళడం లేదు"

అప్రతిభురాలై కొడుకుని చూసినా మరుక్షణంలో నవ్వేసింది భారతి.

అరవై ఏళ్ళవాళ్ళే ఆమె పని ఒత్తిడినీ, రణరంగంలాంటి ఆ వంటగదినీ, ఏ మాత్రం సైనిక సహాయం లేకుండా ప్రపంచయుద్ధాన్ని ఎదుర్కొంటున్నట్లుగా వున్న తన స్థితినీ అర్థం చేసుకోలేనప్పుడు ఆఫ్టరాల్ ఆరేళ్ళ పిల్లవాడు... వాడు తనని అర్థం చేసుకోలేదని వాపోవడంలో అర్థం లేదన్పించింది భారతికి. అందుకే ఆమె నవ్వింది.

అమ్మ నవ్వులో నుండి ముత్యాలు రాలిపడ్డట్టుగా అన్పించింది అశోక్‌కి.

అమ్మ చాలా అరుదుగా నవ్వుతుంది. కారణాలు తెలుసుకుని విశ్లేషించే వయసు లేకపోయినా అమ్మ నవ్వంటే వాడికిష్టం. అందుకే తృప్తిగా వెళ్ళిపోయాడు!

"వదినా ఈ రోజు నేను రాను మధ్యాహ్నం. ప్రొద్దుటే చెప్పాను కదా నాకూ క్యారేజీ సర్దలేదా" రెండు ప్లేట్లలో తనకీ, తల్లికీ యిడ్లీ పెట్టుకుంటూ ప్రశ్నించింది సరోజ.

'ఏం తల్లీ వండివార్చి పెట్టాక క్యారేజీ సర్దుకోవడం కూడా బద్దకమేనా?' లోపలి భారతికి మళ్ళీ మెలకువ వచ్చింది.

"నేను విన్లేదమ్మా సరోజా ఎప్పుడు చెప్పావు?" తను చీర యిస్త్రీ చేయనందుకు శిక్షగా మొన్న పండక్కి అమ్మ పంపిన కొత్త చీర మాటవరసకయినా తనకి చెప్పకుండా కట్టేసుకున్న మరదలినే చూస్తూ ప్రశ్నించింది భారతి.

"ఇప్పుడు చెప్పాగా సర్దకుండా ఆ ప్రశ్నలేవిటి"

"నువు టిఫిను తినేలోగా పెట్టేస్తానమ్మా"

"మామగారిని అభోజనంగా పంపించింది. నువ్వూ క్యారేజీ తీసుకోకుండా వెళ్ళిపోయినట్లయితే దానికేవిటమ్మా బాధ, నా కడుపు రగులుకుపోతుంది కానీ" కూతురి తల నిమురుతూ భర్త మీద అపారమైన ప్రేమను ప్రదర్శించింది అత్తగారు.

'నువ్వసలు మనిషివేనా? సిగ్గుందా అసల్నీకు?' లోపల్నుండి భారతి మళ్ళీ పైకి లేచింది ఆడనాగులా.

మౌనంగా క్యారేజీ సర్ది సరోజను పంపించింది భారతి.

* * *

"అబ్బాయి అయ్యప్పస్వామి మాలవేసుకుంటున్నాడు.. ఇంట్లో శుచిగానూ, మడిగానూ వుండాలి...నీకు బయటుండే సమయమేమొ. మాత్రలూ అవీ ఏదో వుంటాయటగా.. తెప్పించుకుని వేసుకో. మళ్ళీ చెప్పలేదనుకునేవ్?" మీదపడి కొడుతున్నట్లుగా వున్నాయా మాటలు. మృదువుగా మాట్లాడ్డం అత్తగారికి అలవాటే లేదు.

భారతి మనసు బాధతో మూలిగింది.

'ఆయన అయ్యప్పస్వామి మాల వేసుకుంటున్నారా? ఒక్కమాట తనతో చెప్పొచ్చు కదా... తన భర్త మాల వేసుకుంటున్నట్లుగా మూడో వ్యక్తి ద్వారా వినడం... మనసు చివుక్కుమంది.

అయితే ఇప్పటి ఆమె సమస్య పెద్ద గీత ముందు చిన్న గీతగా భర్త తనని చేసిన నిర్లక్ష్యాన్ని చెరిపేసింది. భారతికి నెలసరి వచ్చి నెలమీద పదిరోజులు అయింది. నెల తప్పిందేమోనని అనుమానంగా వుందామెకు. భారతికి ఆడపిల్లలంటే చాలా యిష్టం.

స్త్రీగా జన్మించినందుకు 'ఆడదై పుట్టడం కన్నా అడవిలో మానై పుట్టడం మేలు' అన్న సామెతను తన జీవితం ఋజువు చేసినా చిత్రంగా భారతికి మళ్ళీ ఆడపిల్లే కావాలని వుంది. అందుకే నెలమీద నాలుగురోజులు గడిచినప్పటి నుండీ బుల్లి పట్టులంగా, జాకెట్టూ వేసుకుని బుడిబుడి నడకలతో తనవైపు వచ్చే చిన్ని పాప ఆలోచనలతో ఆమె మనసు మూలుగుతోంది తియ్యతియ్యగా.

ఇప్పుడు తను నెల తప్పినట్లా? లేనట్టా?

అత్తగారు చెప్పినట్లుగా మాత్రలు వేసుకోవడమా, వేసుకోకపోవడమా? ఆలోచించి మానివేయడాన్నే సమర్థించిందామె మనసు.

అయితే భారతి సహనాన్ని, జీవితాన్నే సవాలు చేస్తున్నట్లుగా ఆ తరువాత నాలుగు రోజులకే బయటుంది భారతి. ఆమె గుండె పగిలిపోయింది. ఆడపిల్ల పుట్టనందుకు కాదు. భర్త మాల వేసుకుని వుండగా బయటున్నందుకు... భయంతో వణికిపోయిందామె.

"నా మాటంటే ఎంత నిర్లక్ష్యమే నీకు?" గద్దించింది అత్తగారు.

"ఇందులో నా తప్పేముందత్తయ్యా? నేను మాత్రమేం చేయగలను చెప్పండి" అమాయకంగా ప్రశ్నించింది భారతి.

"అవునే! ఇందులో నీ తప్పేమీలేదు. అంతా నా తప్పే నేను నీకు ముందే చెప్పలేదూ మాత్రలూ, గట్రా వాడుకోమని. నా మాట పెడచెవిని పెట్టింది చాలక 'ఇందులో నా తప్పే ముందత్తయ్యా' అంటూ ప్రశ్నిస్తున్నావా నంగనాచిలా. ఎంత ధైర్యమే నీకు?" ఉగ్రురాలై పోయిందావిడ.

"అత్తయ్యా! మీరు చెప్పి నాలుగైదు రోజులే కదా అయింది. అప్పట్నుండీ వాడినా ప్రయోజనం లేకపోయింది. నాకు ఆయన ముందే చెప్పివున్నట్లయితే బావుండేది మాల వేసుకుంటున్నట్లుగా" అబద్ధమే అయినా 'ప్రాణ, మాన.. బొంకవచ్చు నధిపా' అన్న నానుడిని జ్ఞాపకం చేసుకుంటూ ధైర్యంగానే చెప్పింది భారతి.

"ఏవిటీ! వాడు నీకు ముందే చెప్పి వుండాల్సిందా? అవునూ నువ్వు మహారాణివి కదా. నీ అనుమతి లేందే మాల వేసుకోడం తప్పేమరి... అందుకని కావాలనే ఈ పని చేస్తావా?

నీ నిర్లక్ష్యం రోజురోజుకీ మితిమీరిపోతోంది. అయ్యప్పస్వామి యింట్లో వుంటే నామాట పెడచెవిని బెట్టి నువు బయట చేరుతావా? పైపెచ్చు నేను మాత్రలు వాడానూ అంటూ అబద్ధమాడుతావా? నువ్వు బుద్ధిలేక చెప్పినా నేను నమ్మొద్దూ."

రోజంతా ఆమె సాధింపు కొనసాగుతూనే వుంది. అదేదో పెద్ద నేరం చేసినట్లు తన మీద ఉన్నవీ లేనివీ కల్పించి ఇరుగుపొరుగు వారికి చెప్తూనే వుందామె. భారతికి అర్థ మయింది, అదేదో ప్రళయంగా మారేట్లుందని.

"నన్ను క్షమించండత్తయ్యా" భారతి ఆంధ్రదేశపు ఆడపడుచు. తన తప్పేమీ లేని చోటయినా క్షమాపణ కోరడానికి ఏ మాత్రం వెనుకాడని స్త్రీమూర్తి, సర్దుకుపోవడమే జీవిత పరమావధిగా నమ్మి బ్రతుకుతోన్న ఉత్తమ యిల్లాలు. అప్పటికే మావయ్య మండిపడుతున్నాడు.

"ఇందులో క్షమించడానికేమీ లేదు. నువు వెంటనే ఇల్లు విడిచి వెళ్ళు. భర్త పూజ కోసం ఏ మాత్రం సహకరించని దానివి నువు కాపురమేం చేయగలవు? వెళ్ళు... వెళ్ళిపో... ఎక్కడికెళతావో నీయిష్టం.. ఇక నువు రానవసరం లేదు ఎప్పటికీ" మామగారు తాను ఆ యింటి యజమానినని హఠాత్తుగా గుర్తుచేసుకున్నట్లుగా వున్నారు. అధికారాన్ని ప్రదర్శించారు.

అప్రతిభురాలై పోయింది భారతి. తాను చేయని తప్పుకు యింత పెద్ద శిక్షా? ప్రళయం ఒక్కసారిగా ముంచుకు వచ్చి తనను భూమిలోనికి నెట్టివేస్తున్నట్లుగా తోచింది భారతికి. హఠాత్తుగా ఆమెకు గుర్తుకొచ్చింది. మామగారిలో పెళ్ళినాడే కనిపించిన కట్న కానుకల ఆశ. కట్నకానుకల విషయంలో రాక్షసుడతను - కొడుకుకి రెండో పెళ్ళి చేస్తే కట్నం కానుకలు మళ్ళీ వస్తాయన్న ఆశ అతనికుంది. చాలాసేపటి తర్వాత నోరు విప్పిందామె.

"మామయ్యా మీరు కూడానా! ఇందులో నా తప్పేమీ లేదని తెలిసినా నన్ను వెళ్ళి పొమ్మంటున్నారా? ఇప్పుడు మీరు చెప్పినట్లుగానే వెళ్ళిపోతాను. ఇక్కడుండి స్వామి మడికి భంగం రానివ్వను. కానీ... కానీ స్వామి కొండకి వెళ్ళిన తర్వాత వస్తాను మామయ్యా" ప్రాధేయపడింది భారతి.

"ఆ! అదండీ సంగతి. స్వామి యింట్లో వుంటే బోలెడంత పని వుంటుంది కదా... తెల్లవారుఝామునే లేచి స్నానం చేయడం, స్వామి పూజలూ, స్వామికి వేరేగా వంటా యిదంతా బోలెడంత పని కదా అందుకని ఈ వేషం వేసింది. ఆ పని ఎగ్గొట్టడం కోసం యిలా పుట్టింటికి వెళ్తోంది. సిగ్గులేకపతే సరి... పైగా స్వామి వెళ్ళాక వస్తుందట" అబాంఢం వేసింది అత్తగారు.

"అత్తయ్యా! కాదత్తయ్యా! పనికోసం కాదిలా" బాధగా చెప్పింది భారతి.

"ఇంక మాటలనవసరం వెంటనే బయల్దేరి వెళ్ళు బయటికి" లోపల్నుండి భారతి సూట్‌కేస్ తెచ్చి బయటికి విసురుతూ చెప్పాడు వీరరాఘవులు.

"ఇక నువు రావటానికి వీల్లేదు" శాసించింది అత్తగారు "ఇప్పటికయినా మా యింటికి పట్టిన పీడ విరగడవుతుంది! అంతే చాలు మాకు"

మాల వేసుకున్న స్వామి యింట్లోనే వుండి గంట నుండీ జరుగుతోన్న వాద సంవాదాల్ని వింటూనే వున్నాడు. తండ్రి ఆమెను ఇల్లు వదిలి వెళ్ళిపొమ్మనడం కూడా తెలుస్తూనే వుంది. అయినా స్వామి పెదవి విప్పలేదు. మాల వేసుకున్నపుడు స్వామి కోపం తెచ్చుకోకూడదు కదా అందుకని. కోపాన్ని అణచుకోవడం కోసం సిగరెట్టు కాలుస్తూ పెరట్లోనికి వెళ్ళిపోయాడు 'స్వామి'.

అంత రాత్రి వేళ ఆడదాన్ని, అందునా ఏకవస్త్రని, యింటి నుండి తరిమివేస్తే గానీ అయ్యప్పస్వామి మీది భక్తి నిరూపింపబడలేదా యింట్లో.

ఆ అర్థరాత్రి నిద్రపోతున్న కొడుకుని లేపాలన్న ఆలోచన కూడ లేకుండా, రుద్ర వీణలు విషాద గీతాలాలపిస్తోన్న వేళ భయంకరంగా వున్న చిక్కటి చీకటిలో భయమన్న పదాన్నే మర్చిపోయి నిరామయంగా, మూగప్రేక్షకురాలిలా వెళ్ళిపోతోన్న భారతిని చూసి భరతమాత సిగ్గుతో తలవంచుకుంది.

* * *

హఠాత్తుగా అంత తెల్లవారుఝామున వచ్చిన భారతిని చూసి మొదట ఆశ్చర్య పోయినా తరువాత సంతోషపడ్డారు కుటుంబం సభ్యులంతా.

"ఏవిటమ్మా భారతీ! ఆయన మాల కూడ వేసుకున్నాడేమో కదా. ఇప్పుడు నిన్ను రానిచ్చారా?" ఆతృతగా ప్రశ్నించింది పార్వతమ్మ.

"నేను బయటున్నానమ్మా! స్వామి యింట్లో వున్నాడు కదా... అందుకని" చెప్పింది భారతి ఉబికి వస్తోన్న కన్నీళ్ళనాపుకుంటూ.

భారంగా నిట్టూర్చాడు ఆనందరావు. ఆయన స్టేట్ బ్యాంక్‌లో క్లర్కుగా పని చేస్తున్నారు. పెద్దలు సంపాదించిన ఆస్థిపాస్థులేమీ లేకపోయినా తన సంపాదనలోనే ఎంతో కష్టపడి ఇద్దరి కూతుళ్ళకీ పెళ్ళిళ్ళయినా యన్పించాడు.

మూడునెలలుగా చిన్నకూతురు ప్రసవించి యింట్లోనే వుంది.

హఠాత్తుగా యిలా పెద్దకూతురు ఊడిపడడంతో అతడి హృదయం వణికింది, ఏమైందోనని. మధ్యతరగతి జీవితావేశంతో. ఏమీలేదని తెల్సుకుని భారంగా ఊపిరి పీల్చుకున్నాడాయన.

"పెద్దమ్మా" పరిగెత్తుకుంటూ వచ్చి కావలించుకుంది కస్తూరి పెద్ద కూతురు శ్రావ్య.

"అప్పుడే నిద్రలేచావురా" అంటూ ఆత్మీయంగా పైకెత్తుకుంది భారతి.

హఠాత్తుగా అశోక్ ఆలోచనలు గొంతుకడ్డం పడ్డట్లుగా అన్పించాయామెకు.

"అశోకన్నయ్య రాలేదూ?" ముద్దుముద్దుగా ప్రశ్నించింది శ్రావ్య.

"స్కూలుంది కదూ అందుకని రాలేదు" చెప్పింది.

భారతి మెడ చుట్టూ చేతులు వేసి బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టుకుందా పాప. పెదతల్లి కన్పించిన ఆనందాన్ని దాచుకోవాలన్న ప్రయత్నమేమీ చేయలేదా పసి హృదయం.

భారతి మనసులో ఎంతో ఊరట కలిగినట్లయింది. హఠాత్తుగా ఆమె హృదయం గాలిలో తేలిపోతున్నట్లుగా అన్పించింది.

"ఏవిటీ పెద్దమ్మను లోపలికి రానివ్వవేమే?" కూతుర్ని కోప్పడింది కస్తూరి.

"ఏం కస్తూరీ ఆరోగ్యం బావుందా?"

"బాగానే వుందే" కస్తూరి ముఖంలో నీలినీడలు క్షణకాలం భారతిని కదిలించాయి.

"పెద్దమ్మా! అమ్మకి చెల్లి పుట్టింది తెలుసా" ఇంటి లోపలి మరో వ్యక్తి ఉనికిని గుర్తు చేసింది శ్రావ్య.

అంతా ఫక్కుమన్నారు.

"చెల్లి పుట్టింది నీకు శ్రావ్యా" సవరించింది భారతి.

"పుట్టింది అమ్మకే కదా" ఆ చిన్ని బుర్రలో లా పాయింటు.

టిఫిన్లూ , కాఫీలు అయి తండ్రి బ్యాంక్‌కి వెళ్ళింతర్వాత తల్లి వంట చేస్తూండగా చెల్లి కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది భారతి.

"కస్తూరీ పాప పుట్టి మూడునెలలయింది కదూ! నువ్వెప్పుడు వెళ్తున్నావు ఆయన దగ్గరికి"

మౌనమే సమాధానమయింది.

"కస్తూరీ! మీ ఆయన రాలేదా?"

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా తలవంచుకుంది కస్తూరి.

"ఏమైంది చెల్లాయ్!" చెల్లెలి భుజం మీద చేతులు వేసి ప్రేమగా ప్రశ్నించింది మళ్ళీ.

"అక్కా పాప పుట్టడం నా తప్పా? కొడుకు పుడ్తేనే కానీ రావద్దని ముందే చెప్పి పంపారు. శ్రావ్య పుట్టినప్పుడే గొడవైంది. నాన్న వెళ్ళి కాళ్ళావేళ్ళా పడ్డంతో అప్పుడేదో మొదటిసారి కాబట్టి నా తప్పు క్షమించేశారు. ఇప్పుడు ముందే చెప్పేశారు. ఈసారి కూతు రైతే తిరిగి రావొద్దని. పాప అని తెలియగానే నాకు స్పృహ తప్పినంత పనైంది. అమ్మా, నాన్నా యిద్దరూ సరేసరి కృంగిపోయారు. నాన్న వెళ్ళి ఎంతో చెప్పిచూశారు. ఆఖరికి ఆ రెండో పాపని మేము వుంచుకుంటామని కూడా ప్రాధేయపడ్డారు నాన్న"

"ఏమన్నారు?"

"ఏవంటారక్కా! తెలిసిన వాళ్ళకైతే తెలియజెప్పొచ్చు, అసలే ఏమీ తెలీకపోయినా తెలియజెప్పొచ్చు... తెలిసీ తెలీని మూర్ఖులకి ఎవరు మాత్రం ఏం చెప్పగలరు? మూర్ఖంగా నాన్నను గెంటేశారు. 'ఈసారి మాత్రం మీ అమ్మాయి కొడుకుని కంటుందని నమ్మక మేమిటి? నాకొద్దు విడాకుల కాగితాలు పంపిస్తాను సంతకం చేసి పంపండి' అన్నారట. మా అత్తగారు కూడా ఆయనకు తోడైంది. మామగారు చెప్పినా వీళ్లు వినరు. అక్కడ్నుండి వచ్చాక నాన్న

మరీ కృంగిపోయారు. నాక్కూడా ఏదో తప్పు చేశానన్న భావం... ఒక్కోసారి చచ్చిపోదామని కూడా అన్పింస్తోందక్కా" అక్క ఒడిలో తలదాచుకుని బావురుమంది కస్తూరి. చెల్లి తల మీద చేతులు వేసి నిమురుతూ నేత్రాంచలాలలో ముత్యాల్లా నిలచిన కన్నీటి బొట్లని కొనగోటితో చెరిపేసుకుని నిటారుగా అయింది భారతి.

చెల్లెలని ఓదార్చే ప్రయత్నమేమీ చేయలేదామె. ఏడవన్విడమే మంచిదన్పించింది భారతికి.

జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలినట్లుగా వుంది భారతికి. ఇప్పుడు యిలాటి పరిస్థితుల్లో తన విషయం తల్లిదండ్రులకు తొందరపడి చెప్పకూడదని నిర్ధారించుకున్న దామె. భారతి యిక తిరిగి వెళ్ళదని తెలిస్తే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదనుకుంటారు వారిరువురూ.

"అక్కా! నువ్వు చెప్పు ఇందులో నా తప్పేమైనా వుందా?" ఏడుస్తూ ఏడుస్తూ సగంలో ఆపి మౌనంగా వున్న అక్కని అనుమానంగా చూస్తూ ప్రశ్నించింది కస్తూరి.

"ఛ...ఛ లేదు కస్తూరీ... ఇందులో నీ తప్పేమీలేదు. తప్పంటూ ఏదైనా వుంటే ఈ పురుషాధిక్య ప్రపంచానిది... తప్పంటూ ఏదైనా వుంటే పూర్తిగా నీ భర్తది" ఖచ్చితంగా జవాబిచ్చింది.

ఆశ్చర్యంగా అక్కవైపు చూసింది కస్తూరి.

"అవును కస్తూరీ! ఏదైనా తప్పంటూ వుంటే అది పూర్తిగా మీ ఆయనదే అంటే మగాడిది. అవును పురుష బీజకణంలో వున్న 'వై' క్రోమోజోముది."

"అంటే ఏంటక్కా?"

"స్త్రీ అండంలో కేవలం 'ఎక్స్' క్రోమోజోము మాత్రమే వుంటుంది. పురుషుడిలో అలా కాకుండా కొన్ని వీర్యకణాల్లో 'వై' వుంటుంది. స్త్రీ పురుష సంయోగంలో పురుషుడి తాలూకూ 'ఎక్స్' క్రోమోజోము వున్న వీర్యకణం స్త్రీని చేరుకుంటే స్త్రీలో వున్న 'ఎక్స్'తో కలిసి 'ఎక్స్ ఎక్స్' అవుతుంది. అప్పుడా దంపతులకి ఆడపిల్ల పుడుతుంది. అలా కాకుండా పురుషుడిలోని 'వై' వున్న వీర్యకణం స్త్రీని చేరుకుంటే ఆమెలో వున్న 'ఎక్స్'తో కలిసి 'ఎక్స్ వై' అవుతుంది అప్పుడు మగపిల్లవాడు పుడతాడు... మీ ఆయనలోని 'వై' క్రోమోజోమ్ కాకుండా తన 'ఎక్స్' క్రోమోజోమ్ మాత్రమే నిన్ను చేరుకుని వుంటుంది... ఇందులో నీ బాధ్యతేముంది? అందుకే అన్నాను ఏదైనా తప్పంటూ వుంటే మీ ఆయనదేనని" చిరు నవ్వుని మొహంమీదికి తెచ్చుకుంటూ వివరించింది భారతి.

ఆమె కాలేజీ చదువులు చదవలేదు. జెనెటిక్స్ నేర్చుకోలేదు. అయిన చిన్ననాటి నుండీ ఆమెతో పాటే నడిచి వచ్చిన సాహిత్యాభిలాష ఆమె చేత ఎన్నో ఎన్నెన్నో పుస్తకాలు చదివించింది. ఆ పుస్తకాల్లో జీవితాన్ని చదువుకుంది. అందుకే అంతటి సహనం. ఎంతటి బాధనైనా నిబ్బరంగా ఎదుర్కొనే గుండె ధైర్యం.

ఆరాధనగా భారతినే చూస్తోంది కస్తూరి.

"అక్కా ఆ తప్పు నాది కాదంటే వాళ్ళు ఒప్పుకుంటారంటావా"

జాలిగా చెల్లెల్నే చూస్తూ నవ్వింది భారతి.

"పిచ్చి కస్తూరీ! యమ్.ఎస్సీ, చదివి కాలేజీలో లెక్చరరుగా వుద్యోగం చేస్తోన్న అతడికీ విషయం తెలీదంటావా? ఇది పురుషాధిక్యస్వామ్య ప్రపంచం. మగాడు ఏం చేసినా, ఏం చెప్పినా ఆడది తలవంచి వుండాల్సిందే, బాధగా అన్నది భారతి.

"ఏం చేస్తున్నారే యిద్దరూనూ, పాప అలా గుక్కపట్టి ఏడుస్తుంటే" పార్వతమ్మ వంటగదిలో నుండి కేక పెట్టడంతో యిద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

* * *

వారం రోజుల తరువాత -

"అమ్మా భారతీ, ఇంకేమ్మా అబ్బాయి ఇబ్బంది పడ్తుంటాడేమో మాల కూడ వేసుకున్నాడేమో కదా, నువ్వు ఇక్కడ వుండడం మాకేమీ భారంకాదు. అంతగా కావాలనుకుంటే ఆయన కొండకి వెళ్ళేక వచ్చి వుందువుగాని" అనునయిస్తూ అన్నాడు ఆనందరావు.

ఒక్కక్షణం తటపటాయించినా "నేను వెళ్ళడం లేదు నాన్నా" ఖచ్చితంగా తన నిర్ణయాన్ని తెలిపింది భారతి.

"అదేం మాటమ్మా?"

"నాన్నా! మీరు నిబ్బరం తెచ్చుకోవాలి" అంటూ జరిగిందంతా చెప్పుకొచ్చింది భారతి.

"చూడు భారతీ! ఏదో ఆవేశంలో నిన్నలా వెళ్ళిపొమ్మన్నారేమో కానీ అబ్బాయి కొండ నుండి తిరిగొచ్చాక తప్పకుండా నీకోసం వస్తాడమ్మా. నాకా నమ్మకముంది అనవ సరంగా తొందరపడి నిర్ణయాలు చేయకు" అల్లుణ్ణి సమర్థిస్తూ కూతుర్ని మందలించింది పార్వతమ్మ.

"అమ్మా! అతడు రావొచ్చుకానీ నేనే వెళ్ళనమ్మా! వెళ్ళకూడదని నిర్ణయించు కున్నాను."

"వెళ్ళొద్దే యిద్దరూ వెళ్ళకండి... అవమానంతో మేం లోకం ముందు తలొంచు కునేలా చేయండి... ఇక రేపట్నుండి 'ఇద్దరూ యింట్లోనే వున్నారా?' అంటూ అడిగే వాళ్ళకి నేనేమని సమాధానం చెప్పను" కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అన్నది పార్వతమ్మ అసహాయతతో.

"తొందరపడకు భారతీ" అంటూ అనునయించాడు ఆనందరావు.

"నాన్నా! మీరెప్పుడూ అనేవారు నేను చాలా సహనవంతురాలినని. నిజమే నాన్నా! ఆ సహనంతోనే యిన్నాళ్ళూ జీవితంతో రాజీపడ్డాను. ఆ యింటిలోని ప్రతి ఒక్కరితోనూ, ఆఖరికి నేను కన్న నా కొడుకుతో కూడా సర్దుకుపోవాలనే చూశాను నాన్నా. కానీ నేను చేయని తప్పులకీ... ప్రకృతిసిద్ధంగా వచ్చే నెలసరికి నన్ను బాధ్యురాలిని చేసి యింటి నుండి వెళ్ళగొడ్తుంటే 'ఇదేమిటీ?' అంటూ తల్లిదండ్రుల్ని ప్రశ్నించలేని వ్యక్తి దగ్గర నాకు రక్షణ ఎక్కడిది నాన్నా?

ఆ తప్పు నాది కాదంటే వినకుండా ఘోరంగా తన్ని తగిలేశారు వాళ్ళు. అలాటి యింట్లో నేను మళ్ళీ వెళ్ళి ఎలా కాపురం చేయగలను?"

"భారతీ నామాట వినమ్మా" ప్రాధేయపడింది పార్వతమ్మ.

"వద్దమ్మా! నాకు యిక మీరేమీ చెప్పకండి... నేను ఓపెన్ యూనివర్సిటీలో బి.ఎ.కి అప్లై చేశాను. చదువుకుంటాను. టైపూ, షార్ట్‌హ్యాండూ నేర్చుకుని ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను. నేనూ, నా సంసారం నా యిల్లూ అనే సంక్లిష్టత నుండి నా ఆలోచనలను కొంచెం విస్తృతం చేసుకోనివ్వండి నాన్నా! ప్లీజ్! నాక్కొంచెం నమ్మకమివ్వండి" తండ్రికి అర్థమయ్యేలా చెప్పాలని చూసింది భారతి.

ఎక్కడో మనసు పొరల్లో దాగివున్న లోపలి భారతి ఆత్మాభిమానంతో తలెత్తుకుని లేచి ఒళ్ళు విరుచుకుంది. ఈసారి లోపలి భారతి గెలిచి విజయగర్వంతో భారతిని వెన్నుతట్టి నడిపించసాగింది.

* * *

రెండు నెలలు గడిచిపోయాయి.

భారతి అత్తింటికి వెళ్ళకుండా వుండిపోయినందుకు పార్వతమ్మ అప్పుడప్పుడూ సాధిస్తూనే వుంది. ఇదేమీ పట్టించుకోకుండా భారతి కష్టపడి చదువును కొనసాగిస్తోంది జీవితధ్యేయంగా భావించి.

కొండ నుండి తిరిగివచ్చిన తర్వాత చంద్రశేఖరం కబురు చేశాడు భారతిని రమ్మనమని. రానని చెప్పి పంపింది. అతడే తరలి వచ్చాడు భారతిని వెంటబెట్టుకుని తీసికెళ్ళడానికి, తల్లిదండ్రులిద్దరూ కూతురికి ఎంతగానో నచ్చజెప్పడానికి ప్రయత్నించారు.

ఉహూ! భారతి నిర్ణయంలో, ఇసుమంతయినా మార్పు లేదు.

నిరాశతోనూ, కొంచెం కోపంగానూ తిరిగి వెళ్ళిపోయాడు చంద్రశేఖరం.

కావ్యకి ఇప్పుడు అయిదో నెల వచ్చింది.

కస్తూరి ఈ మధ్య బాగా డీలాపడి కన్పిస్తోంది. తల్లి విసుర్లు కూడా అప్పుడప్పుడూ ఆమెను బాధిస్తూ వున్నాయి.

ఆ రోజు సాయంత్రం ఆనందరావుతో పాటు పూలమొక్కల్లో కెళ్ళి కూర్చుంది భారతి.

"ఏమ్మా చదువుకోలేదా?" కూతుళ్ళిద్దరూ యిలా వచ్చి వుండిపోవడం ఆయనకీ ఎంతో బాధగానే వున్నా ఎన్నడూ వాళ్ళను బాధించేలా మాట్లాడడాయన. అందునా భారతికి మొదట్నుంచీ తండ్రి వద్ద చనువెక్కువ.

"నాన్నా! కస్తూరికి ఒక మిషను కొనిపెడదాం నాన్నా! ఏదో ఒక వ్యాపకం లేకపోతే అది నిస్పృహతో మరోలా ఆలోచించవచ్చు."

"ఏం తల్లీ! దాన్నికూడా కాపురానికి వెళ్ళనివ్వవా? మిషను కొనిపెడ్తుందట మిషను" కాఫీ పట్టుకొస్తూ విసురు విసిరింది పార్వతమ్మ. కూతుళ్ళిద్దరూ కాపురాలు లేకుండా యిలా పుట్టింటికి చేరడంతో అసహనమూ, బాధా ఆమెను కమ్ముకుంటున్నాయి.

తల్లిని చూసి మృదువుగా నవ్వింది భారతి. ఆమె బాధ తను అర్థం చేసుకోగలదు. "అమ్మా! కూర్చోమ్మా నీతో మాట్లాడాలి"

అయిష్టంగానే కూర్చుంది పార్వతమ్మ.

"అమ్మా! కస్తూరి వచ్చిన తర్వాత అతడొక్కసారి కూడ రానేలేదు. పోనీ నువ్వు చెప్పు కస్తూరి ఆడపిల్లను కనడం దాని తప్పా? మగపిల్లాణ్ణి కనడం దాని చేతుల్లోని పనేమీ కాదుగా? ఇంత చిన్న విషయం ఏ మాత్రం శాస్త్రజ్ఞానం వున్న వారికైనా అర్థమవు తుంది. అలాంటిది అంత చదువు చదివిన ఆ మనిషి నేరాన్ని కస్తూరి మీదికి నెట్టి దాని ముఖం చూడ్డం మానేశాడు. అయినా ప్రయత్నలోపమేమీ లేకుండా నాన్న వెళ్ళి అతడికి ఎంతో నచ్చచెప్పాలనీ చూశాడు. అయినా అతడు వినలేదు. ఇంకా బలవంతం చేసి కస్తూరిని తీసికెళ్ళి అతడి వద్ద వదలి వస్తే పరిస్థితేమిటో బాగా ఆలోచించమ్మా? అతడు మరింత పేట్రేగిపోతూ దాన్ని బానిసలా చూస్తోంటే మనం యిక్కడ మనశ్శాంతిగా బ్రత గ్గలమా?" తల్లికి నచ్చజెప్పాలని చూస్తోన్న కూతురివైపు ఆదరంగా చూస్తున్నాడు ఆనందరావు. తన కూతురు తన కళ్ళముందే ఎంతో ఎదిగిపోయి నట్లుగా తోచిందతడికి.

"నువ్వెన్నన్నా చెప్పు భారతి! అది ఎలా బ్రతికినా ఫర్వాలేదు. అసలంటూ అతడు తీసికెళ్ళితేచాలు. ఇద్దరు కూతుళ్ళు యింటికి వచ్చేశారా పార్వతమ్మా?" అంటూ "ఈ ప్రపంచ మంతా వేలెత్తి చూపుతోంటే నేను సిగ్గుతో చితికి పోతున్నాను భారతీ!" దాదాపుగా ఏడ్చేస్తోంది పార్వతమ్మ.

పార్వతమ్మ అవస్థ చూసి భారతి మనసు జాలితో మూలిగింది.

"అమ్మా!... అదేనమ్మా ఈ మధ్య తరగతి తల్లిదండ్రులకున్న లోపం. కూతురు అక్కడ బానిసలా చూడబడ్డా. ఆఖరికి కిరోసిన్ పోసి చంపబడినా ఫర్వాలేదు. పుట్టింట్లో వుండిపోవడాన్ని మాత్రం సహించరు. ఈ సమాజానికి భయపడి కూతుర్ని చంపుకోవడానికి కూడా వెనుకాడరు."

"భారతీ! ఏమిటే యిదంతా? నువ్వేం చెబుతున్నావు" పార్వతమ్మ దీనంగా ఏడుస్తోంది.

"అమ్మా! ప్లీజ్ ఏడవకమ్మా... మీరలాంటి తల్లిదండ్రులు కాకూడదనే అమ్మా నేనింత దూరం చెప్పింది... తలవంచుతూ పోతే యింకా యింకా మొట్టాలనే చూస్తుందీ సమాజం... ధైర్యంతో ఎదురు నిలిస్తే భయపడి పారిపోతుంది... మధ్యతరగతి తల్లిదండ్రులు చాలా మారాల్సి వుందమ్మా... గుండె ధైర్యాన్ని మించిన ఆయుధం ఈ ప్రపంచంలో మరేమీ లేదు... నా మాట వినండి. కస్తూరిని బలవంతంగా అతడి వద్దకు పంపి కిరోసిన్ చావును పేపర్లో చూసేలా చేయకండి"

"అయితే ఇప్పేడేమంటావే?"

తల్లిలోని ఆ స్వల్పమైన మార్పే భారతిలో గొప్ప ఉత్సాహాన్ని నింపింది.

"దానికెలాగూ చదువబ్బలేదు కాబట్టి టైలరింగ్ నేర్పిద్దాం. మెల్లగా ఓ మిషను కొనిద్దాం... దానికో వ్యాపకం ఏర్పడ్డట్టుంది... మనసుకి మంచి డైవర్షన్ కూడాను.. కొన్నాళ్ళు యిలా గడవనివ్వండి... అతడిలో పరివర్తన కలిగి అతడంతట అతను కస్తూరిని పంపమని అడిగినట్లయితే తప్పక పంపేద్దాం.

"అమ్మా! మాక్కొంచెం నమ్మకమివ్వండమ్మా... మాక్కొంచెం చేయూత నివ్వండి. ఆత్మగౌరవం దెబ్బతిని పుట్టింటికి వచ్చిన ఆడపిల్లల్ని బలవంతంగా తిప్పి పంపించేయాలని చూడకండి... ఆత్మ విశ్వాసాన్ని నింపండి... నిల దొక్కుకునేలా ధైర్యాన్నివ్వండి. ఈ సమాజానికి భయపడి నీతి పాఠాలు వల్లించకండి - బానిసల్లా బ్రతికే ఈ దుస్థితి నుండీ, ఈ పురుషాధిక్య వ్యవస్థ విషపు కోరల్నుండీ మమ్మల్ని కాపాడండి... మాక్కొంచెం చేయూత నివ్వండి" చేతులెత్తి దణ్ణం పెడుతూ ప్రాధేయ పడింది భారతి.

పార్వతమ్మ అవాక్కయి కూతుర్నే చూడసాగింది.

"నువు ఎంతో ఎత్తుకు ఎదిగి పోయావమ్మా భారతీ!... ఈ వ్యవస్థకి భయపడి అణిచి పెట్టబడ్డ నా ఆశయాలన్నింటినీ పుణికి పుచ్చుకున్నావు. నేను గర్విస్తున్నానమ్మా... నిన్ను కన్నందుకు నేనెంతో గర్విస్తున్నాను... జన్మభూమి మీది అభిమానంతో ఆనాడు నేను 'భారతి' అని పేరు పెట్టుకున్నందుకు భరతమాత గుండె ధైర్యాన్ని సంతరించుకున్నావు. నా కళ్ళు తెరిపించావు" ఆప్యాయంగా కూతురి తల నిమురుతూ మరో చేత్తో ఆనందంతో వర్షిస్తోన్న కళ్ళని తుడుచుకున్నాడు ఆనందరావు.

భారతి లోపల భారతి ఉప్పొంగిన గోదావరే అయింది.

రచన సచిత్ర మాసపత్రిక, జులై 1993